# చేసిన ధర్మం

పాలకన్నా, పాయసంక న్నా, పంచదారకన్నా, కలకండకన్నా తియ్యనైనది ఏది- అని ఎవరైనా అడిగితే, తటపటాయించకుండా 'పొగడ్త' అని బదులు చెప్పొచ్చు. అవును మరి. పొగడ్తంటే ఇష్టం లేని దెవరికి? 'అనాథ రక్షకా! ఆపద్బాంధవా! ఆర్తత్రాణ పరాయణా!' అనేసరికి భగవంతుడే పరవశించిపోతుండగా లేంది, ఇక మానవులొక లెక్కా? క్రింది ఉద్యోగులు పై అధికారికి మస్కా గొట్టడానికి, ప్రేమికులు ప్రియురాండ్రను బుట్టలో పెట్టడానికి తిరుగులేని చిట్కాలుగా పనికొస్తున్నవి పొగడ్తలే గదండీ!

పొగడ్తల సమ్మోహనాస్త్రాల బారికి కొమ్ములు తిరిగిన వాళ్ళే గుమ్మైపోతుండగా, పాపం - మల్లెల గురప్ప ఎంతటివాడు? ఆతడేమైనా చదువరా? గొప్ప షావుకారా? పేరుమోసిన పెద్ద మనిషా? అదేం కాదు. ఉన్నదంతా అయిదెకరాల చేను. వానకురిస్తేనే అందులో పంట. ఇన్నూటికి దరిదాపుల్లో వుండే గొర్రెల మంద. నాలుగో అయిదో పాలిచ్చే ఆవులు. రెండు పూరికొట్టాలు, ఒక చుట్టు గుడిసె. సంతానానికి గూడా కరువొచ్చినట్టుగా ఇద్దరే ఇద్దరు కొడుకులు. ఇంట్లో వంటపనికైనా, పొలంలో సేద్యం పనికైనా, అడవిలో జీవాలను మేపే పనికైనా సరదారైన భార్యను గూడా కలుపుకుంటే అతడి స్థిర, చరాస్తులన్నీ యింతే!

అలాంటి సాదా సీదా సన్నకారు రైతు మల్లెల గురప్ప తన దురదృష్టం వల్లనైతేనేమి, విధి విలాసం వల్లనైతేనేమి పొగడ్తల వలలో పడిపోయాడు. అతడిలోని ఈ బలహీనతను కనిపెట్టిన వ్యక్తి పేరు రమాకాంత భాగవతారు. దేవళం పేట చింత తోపులో, ధర్మరాజుల గుడి ముందర భారత పురాణ ప్రవచనం చేస్తుండగా భాగవతారుకు మల్లెల గురప్ప తొలిసారిగా తారసిల్లాడు. అప్పుడాయన చెబుతున్న ఘట్టం కర్ణ జననం.

పచ్చి కొబ్బరి మట్టల పందిరి కింద, చల్లటి ఇసుక పైన కూర్చున్న సభాసదుల్లో ఆవులింతలు, కునికిపాట్లు ఉచ్చులు తెంచుకునేటట్టుగా ఒకసారి వారిచేత గోవిందనామస్మరణ చేయించి, భాగవతారు కథా ఘట్టాన్ని అందిపుచ్చుకున్నాడు.

"మహా జనులారా! వైశంపాయన మునీంద్రుడు జనమేజయునితో ఏమంటున్నాడంటే- విన్నావు గదా, జనమేజయ మహారాజా! ఇవ్విధంబున సూర్య భగవానుని వరం వలన కుంతి భోజుని పుత్రికి సద్యోగర్భంబున కోటి సూర్యప్రభా విరాజ మానుడైన పుత్రుడు జన్మించిన వాడాయెను. కర్ణ కుండలములతో పుట్టినందున ఆ శిశువు కర్ణుండు నాబరగెను. ఆ కర్ణుడు ఎటువంటివాడు? కృతయుగంలో బలిచక్రవర్తి దాత, త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు దాత, ద్వాపరంలో కర్ణుడే దాత. దాత అంటే ఏమిటి? దాత అంటే ఎవరు! నాయనా, నువ్వు దాతవా? బాబూ, నువ్వు దాతవా? అయ్యా, నువ్వు దాతవా?......"

చూపుడు వ్రేలితో నిర్దేశించి తననే నిలదీసి అడుగతున్నట్టుగా తోచేసరికి బారెడు దూరంలో కూచున్న మల్లెల గురప్ప తటాలున లేచి నిల్చున్నాడు. జేబులో చెయ్యివేసి దొరికిన ఓ అయిదు రూపాయల నోటు తీసి హరిదాసుగారి చేతిలో పెడుతూ 'దాత, గీత అనొద్దండి సామీ! నేను మల్లెల గురప్ప'ని అన్నాడు.

అంతటితో భాగవతారు పుంజుకున్నాడు- "అయ్యలార! దానము, భోగము, నాశము అని డబ్బుకుండేవి మూడే గతులు. నువ్వు డబ్బు కూడబెడతావు. ధర్మం చెయ్యవు. ఏమవుతుంది? నీ సంపద పరుల పాలు. పోనీ, భోగాలను భవిస్తావు, రోగాలు తప్పవు. కనుక చేసిన ధర్మమే చెడని పదార్థం - అని ఈ విధంగా భావన చేసినవాడై, మహాదాత కర్ణుడు జన్మించిన శుభసమయంలో 'చేతులకు తొడవు దానము, భూమిసురులకు తొడవు బొంకమి ధరలో, - అన్నట్టుగా హరిదాసుకు అయిదు రూపాయ లర్పించిన పరమ భాగవతోత్తముడు మల్లెల గురప్ప ఈశ్వరుడెక్కేటి నంది వాహనం తోడు గలిగి, పరమాత్ముడెక్కేటి పక్షి వాహనం తోడుగలిగి, దేవాన్ దేవతల తోడు గలిగి, విక్రమార్కుల వంటి కొమాళ్లు కలిగి, ధనం ధాన్యం గలిగి సుఖోజయంగా వర్ధిల్లు గాక, ఇట్లని దేవ దేవుడతనిని అనుగ్రహించు గాక!"

ఒళ్ళంతా చందనమలదినట్టుగా మల్లెల గురప్ప పులకించిపోయాడు. ఒక అయిదు రూపాయల నోటు తనది కాదనుకునేసరికి తాను సభా పూజ్యుడై పోయాడు. సభికులనే చుక్కల్లో చందమామైపోయాడు. ఔరా, ఎంత వింత! దాసుగారికి చెయ్యి సాచడంలో యింత మర్యాద వుందా? ఇంత మన్నన వుందా! సరే, దీని అంతేమిటో తేల్చుకోవలసిందే! ఆ మరునాటి నుంచీ గురప్ప ఒక మరచెంబు నిండుకూ ఆవు పాలతో సహా పురాణ కాలక్షేపానికి హాజరవుతూ వచ్చాడు. అట్లాగని చదివింపులకు దీంతో సంబంధం లేదు. దానికదే, దీనికిదే! పాలు తానేమీ డబ్బిచ్చి కొనింది కాదు గదా! తాగనీ, అది స్వామికి ప్రత్యేక నైవేద్యం!

పురాణ కథలో ఏ సందర్భాన్నయినా స్వప్రయోజనానికి అనువుగా మలుచుకోడం భాగవతారుగారికి కొట్టిన పిండి అనే విషయం కొందరు అమాయక జీవులకు తప్పితే, చాలామందికి తెలిసిపోయింది. ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో మల్లెల గురప్ప సమర్పించిన చిరుకానుక అందుకుని ఆయన యిలా ముదలకించుకున్నాడు:

"మహాజనులారా! విన్నారు గదా! అప్పగిది దుష్ట దుశ్శాసునుడు ఈడ్చిన కొద్దీ వలువలొస్తూనే వున్నాయి. ఎలా జరిగిందది? కన్నయ కరుణ వల్ల జరిగింది. నల్లనయ్యకెందుకు నాయనా అంత కరుణ? చెరుకు తింటుంటే ప్రభువుకు వేలు కోసుకపోయింది. ద్రుపదరాజునందన తటాలున చీర చెరగు చించి కట్టుగట్టింది. అంత చిన్నకైంకర్యానికి యింతటి మహోపకారమా అని మీరనుకోవచ్చు. అవునండీ! అదంతే! పెద్ద లేమన్నారు? క్షేత్రమెరిగి బీజము, పాత్ర మెరిగి దానము అన్నారు. పంట కాపు ఏమన్నాడు? అదనుకు అడ్డెడు చల్లితే పుట్టెడు పండుతుందన్నాడు. ఈ ధర్మసూక్షాన్ని గుర్తెరిగి ద్రౌపదీ మానసంరక్షణ సందర్భంలో హరిదాసుకు అయిదు రూపాయలర్పించిన మల్లెల గురప్పను ఏమని దీవించగలం? అతడు పట్టింది బంగారమవుగాక! అతడు ముట్టింది ముత్యమవుగాక! అతడు పెరటి చెట్టు కల్పవృక్షమగుగాక! అతడి కొట్టులో గోవు కామధేనువగుగాక! నూరేళ్ల ఆయుస్సు కలిగి, మేడలు మిద్దెలు కలిగి,ముని మనవళ్ళు మనవరాండ్రు కలిగి, అతడి సుఖోజయంగా వర్ధిల్లు గాక! అట్లని దేవదేవు దతనిని అనుగ్రహించును గాక!"

చివరికిది ఎక్కది దాకా వచ్చిందంటే- ఈవిలో గురప్ప ఓడిపోతాడా, స్తోత్ర పాఠంలో భాగవతారు ఓడిపోతాడా అన్నంతవరకూ వచ్చింది. ఎవరూ ఓడిపోయేటట్టు

లేరు. హరిదాసు వెనుకా ముందూ చూడకుండా, బారెడు హెచ్చా తక్కువా గమనించకుండా మాటల మూటలు విప్పి మల్లెల గురప్ప మీద మచ్చు మందు చల్లుతూనే వున్నాడు – "ఇయ్యగల, ఇప్పించంగల అయ్యలకే గాని మీస మన్యులకేలా? రొయ్యకు లేదా మీసము - అన్నాడు గదండీ కవి! అవునవును. మీసమనేది ఎవరికుండాలి? మల్లెల గురప్పలాంటి వదాన్యశేఖరులకే వుండాలి! కలిమి గల లోభి కన్నను, విలసితముగ పేద మేలు వితరణియైనన్, చలిచెలమ మేలుగదా, కులనిధి అంబోధి కన్న – అన్నట్టుగా గురప్ప ఒక ఒక్కరైతు అయితే మాత్రం ఏమండీ! అతడు ప్రతిరోజూ తెచ్చి యిచ్చే గోక్షీరం ఎంత తియ్యనో, అతడి మనసంత తియ్యన. అతడు నివేదించే కానుక అదే మాకు అనుదినవేడుక. ధర్మరాజు గావించిన విరతాన్న దానం సక్తుప్రస్థుడి గంజిమెతుల ముందు దిగదుడుపే గదండీ! ఆ కథ యిక ముందుముందు వస్తుంది. 'చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు, కొంచెమైన నదియు కొదువగాదు, విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత' అని వేమన్న గారు చెప్పింది ఎవర్ని గురించి? ఇదిగో మన గురప్పలాంటి వాళ్ళని గురించి...." ఇలా మల్లెల గురప్ప తాలూకు కీర్తికాంత దాసుగారి నాలుక పైన విశృంఖల విజయతాండవం చేయసాగింది.

పద్దెనిమిది రోజులు గడిచాయి. మహాభారత యజ్ఞం పరిసమాప్తికి వచ్చింది. ఆ మరునాటి నుంచీ దేవళం పేట చింతతోపు నిర్జనమై బోసిపోయింది. ఇదంతా మామూలే. కానీ, ముల్లె ఏదో చేజారిపోయినట్టు మల్లెల గురప్ప పెద్ద వెలితికి గురి కావడమే విచిత్రం. అతడి కొకటే ఆలోచనైపోయింది. మళ్ళీ స్వామి ఎప్పుడు కనిపిస్తాడో? ఆయనది ఏ వూరో? అసలింతకూ ఆయన్ను మళ్ళీ చూసే ప్రాప్తం తనకుందో లేదో! ఆహా, అవి మాటలా? మాణిక్యాలు గదా?

అయితే ఒకటి. దేశం ఎంత సువిశాలమైనదైనా అవుగాక! బొందిలో ఊపిరనేది వుంటే పూర్వ పరిచితులైనవారు ఎప్పుడో ఒకప్పుడు ఒకచోట ఎక్కడో కలుసుకునే అవకాశం వుండనే వుంటుంది. దీపావళికి ముందు పండుగ బట్టలు కొనడం కోసం మల్లెల గురప్ప తిరుపతికి వెళ్ళిరావడం రివాజు. బట్టలు మూట భుజాన పెట్టుకుని బస్సు కోసం వెదుకుతుండగా బస్‌స్టేషన్లో అతనికో వ్యక్తి కనిపించాడు. ఆయన చూడ్డానికి వయసులో రమాకాంత భాగవతారుకు అన్న లాగానో, చిన్నన్న లాగానో వున్నాడు. పళ్ళన్నీ వూడిపోయాయేమో, దవడలు లోపలికి పోయాయి. సులోచనాల వెనుక కళ్ళు కొడిగట్టిన ఆముదపు దీపాల్లా వెలవెలపోతున్నాయి. తల బట్ట బారిపోయింది. ఎవరై వుంటాడబ్బా ఈయన? గురప్ప తటపటాయిస్తూనే వెళ్ళి ఆయన ముందు నిల్చున్నాడు. దాదాపు పదిహేనేళ్ళకు ముందు దేవళం పేటలో భారతం చెప్పిన భాగవతారే అయితే ఈయన తనను పలకరిస్తాడు. లేకపోతే లేదు. ఒక చిన్న ఎత్తువేసి చూస్తే తప్పేముంది?

బెంచ్‌పైన కూర్చున్న ముసలాయన తన కెదురుగా వచ్చి నిల్చున్న గురప్పకేసి అదే పనిగా కొద్ది క్షణాల వరకు తేరిపార జూచాడు. తెగిన జ్ఞాపకాల మధ్య లింకు తగులుకున్నట్టె వున్నట్లుండి "మల్లెల గురప్పవి గదూ! బాగున్నావా బాబూ?" అని పలకరించాడు.

"స్వామీ, మీరేనా? నేనింకా ఎవురో అనుకుంటి. ఇదేమి స్వామీ యిట్టయి పోతిరి! జబ్బుపడి లేస్తిరా ఏంది?" అంటూ వాపోయాడు గురప్ప.

"కాలప్రభావం నాయనా! రాముకూర్చో!" అన్నాడు మాజీ హరిదాసు. అంటూ బెంచీపైన కొంచెం తావు కూడా చేశాడు.

"వొద్దు సామీ! నేనిట్లా గుడ్డలమూట పైన్నే కూచుంటా! మీరు చెప్పండి. ఉండడమెక్కడ? ఇక్కడికెప్పుడొస్తిరి? ఇప్పుడెందాకా ప్రయాణం? బిడ్డపాపలు బాగుండారా?" అంటూ పరామర్శలు గుప్పించాడు గురప్ప.

"నాయనా, మల్లెల గురప్పా! నువ్విప్పుడడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పడమంటే నా జీవిత చరిత్రంతా చెప్పటమే! చెప్పాలనే వుంది. కానీ ఎవరి బస్సు ఎప్పుడొస్తుందో తెలియదు. నీ బస్సొస్తే నువ్వు, నా బస్సొస్తే నేను వెళ్ళక తప్పదు. చూచావా గురప్పా! అనువైన వేదాంత సారమంతా అదే! నేను నూటడెభైఆరుసార్లు రారాజు సుయోధనుణ్ణి వధించాను. ధర్మరాజును కూడా అన్నిసార్లు స్వర్గానికి సాగనంపాను. అంటే నూటడెభ్బై ఆరుసార్లు మహాభారత ప్రవచనం చేశానన్నమాట! కానీ ఏం లాభం? కూరలో వున్నంత మాత్రాన గరిటకు రుచి తెలిసి ఏడ్చిందా? ఆకొన్న పెద్దపులి అడవిలో కనిపించిన మృగాన్నంతా చంపితిన్నట్టుగా, నీతుల్ని చెప్పిచెప్పి, పొగడ్తలు రువ్విరువ్వి, అయిన డబ్బంతా దోచుకొచ్చి వెయ్యేండ్లో, లక్షేండ్లో బ్రతికిపోవాలనుకున్నాను. నా సంపాదనంతా పెట్టుబడిగా పెట్టి, కొడుకుల్ని విక్రమార్కులుగా చేసెయ్యాలనుకున్నాను. పెద్దవాడు సముద్రాల కవతల అమెరికా అమ్మాయిని చూచుకొని, ఆ దేశపు పౌరసత్వం పుచ్చేసుకున్నాడు. తల్లి పోయిందని రాస్తే వాడొక సానుభూతి సందేశాన్ని యస్.టి.డి.లోనే చెప్పేశాడు. రెండోవాడు హర్యానాలో ఇంజనీరు. వాడి భార్య గూడా అక్కడ లెక్చరరు. తామూ, తమ బిడ్డలూ పల్లెటూరికి వచ్చి, కొద్దిరోజులక్కడ గడపడం సాధ్యం కాదని వాళ్ళు తెగేసి చేప్పేశారు. మూడో వాడు ఉత్తర ఈశాన్య రైల్వేలో పెద్ద ఉద్యోగి. నేను గనుక అక్కడికి వెళ్ళి తన దగ్గరుండిపోతే సాకడానికి అభ్యంతరం లేదని వాడేమో అభయమిచ్చేశాడు. ఆ భాష మనకు రాదు. వారి భార్యాబిడ్డలు కూడా తెలుగు మాట్లాడరు. మూగ జీవంలా నేనక్కడ ఎలా జీవించగలను? పోగా నాలుగోవాడు కాస్తా నయమేమోనని అనుకుంటూ వచ్చాను. ఆ ఆశ కూడా నిన్న మొన్నటికి అడుగంటింది. వాడికో రెండేళ్ళ కూతురుందిలే. ఆ పిల్ల కళ్ళల్లో మెదిలినట్టుంటే చూచొద్దామని రేపల్లె నుంచి బయల్దేరి, అయిదువందల కిలోమీటర్లు ప్రయాణం చేసి, బెంగుళూరు చేరుకున్నా. ఇంటికి వెళ్తే వారాయిల్లు ఖాళీచేసి మూడు నెలలైనట్టు తెలిసింది. ట్రాన్స్ఫరైనట్టు కార్డుముక్క రాసే ఓపిక కూడా వాడికి లేక పోయింది. అక్కడికి తెల్లవారింది నా బతుకు. అతీగతీ పట్టించుకునేవాళ్ళు లేకపోయారు. పురుషార్థమెట్లాగూ లేకపోయింది, పుణ్యమైనా దక్కించుకుందామని తిరుగుప్రయాణంలో తిరుపతియాత్ర పెట్టుకున్నా......"

కొద్ది నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి. "పోనీలే, నువ్వెలా గున్నావు గురప్పా?" అని ఈసారి హరిదాసే అడిగాడు.

"ఆ మాటెందుకులే సామీ! నా కొడుకులు నన్నట్లా వదిలిపెట్టే రకం గాదు. కయ్యిలో తొలిమడక నేను కట్టాల్సిందే! సాల్లో తొలిగింజ నేనెయ్యాల్సిందే! పంట దేవరకు పొంగలదీ పెట్టాలన్నా, పంట కళ్ళంలో మేర గింజలు కొలవాలన్నా, ఏ వస్తువు కొనాలన్నా, ఏ సరుకు అమ్మాలన్నా, నేనో, వాళ్లమ్మో ముందుండాల్సిందే! అంతా మీ దివెన్ల ఫలితం సామీ! లేకపోతే బోరుయేస్తే తొండంతో చిమ్మినట్లు నీళ్ళు

దూకేవేనా? తొండలు గుడ్లుపెట్టే సవిటిపఱ్ఱ మొదటి రకం మాగాణిగా మారేదేనా? పూరి కొంపలు మిద్దెలయ్యేవేనా? మీ వాక్కు బ్రహ్మవాక్కు. మీరెంత చెబితిరో, అంతా జరిగింది." హఠాత్తుగా ఏదో జ్ఞాపకంవచ్చినట్టు తటాలున లేచి నిల్చున్నాడు గురప్ప. "ఒక యిన్నపం సామీ! మళ్ళీ తమర్ని చూచే అదురుష్టం నాకుందో, లేదో - నాదగ్గిర యిది వుంది. ఇదే పదివేలని మీరు పుచ్చుకోవాల - నిండు మనసుతో దీవించాల!" అన్నాడు.

భాగవతారు కళ్ళలో కన్నీళ్ళు గిర్రున తిరిగాయి.

"నాయనా, గురప్పా! నువ్వు బాగున్నావు. నీ బిడ్డలు బాగున్నారు. నీ సంసారం పాలు పొంగినట్టుగా పొంగుతూ వుంది. మీరు మనుషులుగా పుట్టి మనుషులుగానే జీవిస్తున్నారు. చాలా ఆనందంగా వుంది. నాయనా, బ్రహ్మానందంగా వుంది. నువ్వేదో యివ్వదలచి నన్ను పుచ్చుకొమంటున్నావు, నువ్వివ్వడానికీ, నేను వుచ్చుకోడానికి యిదేమైనా మొదటిసారా? నాబోటి వాళ్ళకు నువ్వు కానుకలిస్తావు. ప్రజానాయకు లడిగితే వోట్లిస్తావు. పనిచేసిపెట్టిన వాళ్ళడిగితే బక్షీసులిస్తావు. ఇంటిముందరికి వచ్చి 'దేహీ' అని ఎవడు చెయ్యి సాచినా నీకున్నది అంతో యింతో పెట్టి పంపిస్తావు. ఇంటికి తల్లి ఎలాగో, దేశానికి నువ్వలాగు! నీ పాడితో, నీ పంటతో నువ్వు చల్లగా వర్ధిల్లాలి. నీ సుఖమే దేశానికి సుఖము. నీ జయమే లోకానికి జయము. వెళ్ళిరా బాబూ, వెళ్ళిరా!" అన్నాడు భాగవతారు.

♦ 'ఆంధ్రజ్యోతి' దీపావళి సంచిక, 1990 ♦